


# న్యాయం

పాలకుర్తి సీతాలత

**దమయంతి** ఆ రోజు పోస్టులో వచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డరు కాగితం అందుకుని మురిసిపోయింది. తండ్రి పోయిన ఆ సంసారానికి పెద్ద కూతురు అయినందువల్ల ఆమే దిక్కు అయ్యింది. అక్కడా ఇక్కడా ట్యూషన్లు చెప్తూ, కుట్టుమిషిన్ మీద బట్టలు కుడుతూ ఏదోలా రోజులు వెళ్ళబుచ్చింది. ఈ రోజు ఇలా ఉద్యోగం రావడంతో పొంగిపోయింది.

"అమ్మా! ఇక మన కష్టాలు గట్టు ఎక్కినట్లే". అంది ఆనందంగా.

ఆర్డరు కాగితంలో రాసిన గడువులోగా వెళ్ళి జాయి నయింది.

"మీరు దోసకాయలపల్లిలో ఉన్న మా బ్రాంచి ఆఫీసులో పని చెయ్యాలి" అన్నాడు పర్సనల్ మేనేజర్ పరమాత్మ.

దోసకాయలపల్లి ఆ ఊరికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడకు వెళ్ళడానికి కంపెనీ బస్సులు ఉన్నాయి కానీ, గంట ప్రయాణం. ఆ చుట్టుపక్కల ప్రాంతాలు ఇంకా డెవలప్ కానందు వల్ల అక్కడకు వెళ్ళే ఉద్యోగులు భోజనం కూడా తీసుకుని వెళ్తారు. ఈ విషయాలు అన్నీ దమయంతికి ముందే తెలుసు.

"సార్! ఉద్యోగంలో చేరి ఇంకా పనికూడా మొదలు పెట్టకముందే నేను డిమాండ్స్ చేస్తున్నానని అనుకోకపోతే ఒక విషయం...నన్ను ఈ ఆఫీసులోనే పోస్టు చేస్తే సంతోషిస్తాను. సార్! ఈ ఆఫీసులోని వేకెన్సీలు నింపడం కోసమే రిక్రూట్ చేసుకుంటున్నట్లు ప్రకటనలో వేశారు కద సార్..." అంది దమయంతి వినయంగా.

దమయంతివైపు మెచ్చుకోలుగా చూశాడు పరమాత్మ. ఆమె చాలా తెలివైన అమ్మాయి అని ఆ మాటలవల్ల గ్రహించాడు. అందుకే తన సమస్య ఆమె ముందు చెప్పుకోవడంలో తప్పు లేదని భావించాడు పరమాత్మ. "చూడమ్మా! నువ్వు చెప్పినదంతా నిజమే...ఇక్కడ ఉన్న వర్కర్ల యూనియన్ వాళ్ళు కొన్ని డిమాండ్లు చేశారు. అందులో ఒకటి ఏమిటంటే, దోసకాయలపల్లిలో పని చేస్తున్న సీనియర్లని ఈ ఆఫీసుకి బదలీ చెయ్యాలి. కొత్తగా ఉద్యోగంలో చేరడానికి వచ్చే వాళ్ళను దోసకాయలపల్లిలో పోస్టు చెయ్యాలి. ఇందుకు మా జనరల్ మేనేజర్‌గారు ఒప్పుకున్నారు. దోసకాయలపల్లిలో ఎక్కువ సౌకర్యాలు లేకపోవడం, ఒక మూలగా విసిరేసినట్లు ఉండడం అందుకు కారణాలు" అన్నాడు పరమాత్మ.

పరమాత్మ వైపు చూసింది దమయంతి.

"ఇప్పుడు నువ్వు చిన్న గుమాస్తాగా దోసకాయలపల్లిలో చేరతావు. ఇదే కేడర్‌లో అక్కడ ఉన్న ఒక సీనియర్ మనిషి ఇక్కడకు వస్తాడు. అదమ్మా సంగతి. కొత్తలో నీవు అక్కడకు వెళ్ళడం కొంచెం ఇబ్బందిగా ఉండొచ్చు గానీ, త్వరలో అలవాటు అయిపోతుంది. ఈ విషయంలో నీకు సహాయం చెయ్యలేను. కంపెనీ బస్సుకి టికెట్టు లేదు. కనక ఖర్చు గురించి బెంగ లేదు" అన్నాడు.

"ఖర్చు గురించి కాదు, సార్! ఆడపిల్లను కదా...కొంచెం ఇబ్బంది అని. ఈ రూలు ఆడపిల్లలకుకూడా వర్తింపచెయ్యడం బాగోలేదు" అంది దమయంతి.

"నాకూ బాగోలేదమ్మా! కానీ ఏం చెయ్యను? యూనియన్‌తో గొడవపడటం మాకు ఇష్టం లేదు. చాలా స్ట్రాంగ్ యూనియన్. వాళ్ళతో గొడవ పడితే ప్రొడక్షన్‌కి దెబ్బ" అన్నాడు పరమాత్మ.

"పోన్లెండి. అవకాశం ఉంటుందేమో అని అడిగాను. కుదరకపోతే ఫరవాలేదు. నేను ఉద్యోగం చెయ్యడం చాలా ముఖ్యం. దోసకాయలపల్లి కాక గుమ్మడికాయలపల్లి అయినా, నేను వెళ్ళక తప్పదు" అంది దమయంతి.

దోసకాయలపల్లిలో పోస్టు చేస్తున్నట్లు ఆర్డరు ఇచ్చాడు పరమాత్మ.

ఆ మర్నాడు అక్కడ చేరింది దమయంతి.

** ** **

రెండు నెలలు గడిచాయి. దమయంతి ఉద్యోగానికి వెళ్ళి వస్తోంది కానీ, ఆమెకు కొన్ని ఇబ్బందులు కలుగుతున్నాయి. అవి పనిలో కలుగుతున్నవి కావు. అక్కడకు వెళ్ళి రావడంలోనే. హెడ్డాఫీసులో పోస్టింగ్ అయితే ఆఫీసు తొమ్మిదిన్నరకు కనక ఇంటి దగ్గర తొమ్మిదింపావుకి బయలుదేరవచ్చు. ఇప్పుడు ఎనిమిదిన్నరకే బస్‌స్టాప్‌లో నిలబడాలి కనక మరో పది నిమిషాల ముందే ఇల్లు విడిచి పెట్టాలి. భోజనం కూడా తీసుకువెళ్ళాలి కనక ఆ సమయానికి వంట అయిపోవాలి. తల్లికి అనారోగ్యం కలిగితే ఆ వంట కూడా తనే చేసుకోవాలి. సాయంత్రం నాలుగున్నరకు ఆఫీసు అయిపోయాక ఇల్లు చేరడానికి అయిదున్నర అవుతోంది. అదే హెడ్డాఫీసులో ఉంటే అయిదుకి లోపల ఇల్లు చేరుకోవచ్చు.

ఈ ఇబ్బందులన్నీ భరిస్తూ ఉద్యోగం చేసుకుంటోంది దమయంతి.

ఒక రోజు ఆమె దోసకాయలపల్లి ఆఫీసులో పని చేసుకుంటుండగా ఆమె దగ్గరకు ఒక వ్యక్తి వచ్చాడు. "మీరేనా కొత్తగా చేరిన దమయంతిగారు?" అడిగాడు.

"అవును. మీరు ఎవరు?" అంది దమయింతి.

"యూనియన్ లీడరు ప్రసాదరావుని. యూనియన్‌లో చేరాలి మీరు. సంవత్సరానికి అయిదు రూపాయలు కడితే చాలు" అన్నాడు ప్రసాదరావు. బిల్లు బుక్కు తీస్తూ.

"ఆ మొత్తం ఇయ్యడం పెద్ద కష్టం కాదు కానీ. నేను యూనియన్‌లో చేరను" అంది.

యూనియన్ మెంబరు అయినందువల్ల వచ్చే లాభాలు ఏకరువు పెట్టాడు ప్రసాదరావు.

"అంతా బాగానే ఉంది. ఏదైనా సమస్య వస్తే ఒంటరిగానే పోరాడగలను. మీరు పెట్టిన రూల్సు నాకు నచ్చనప్పుడు నేను ఎందుకు మెంబరుగా చేరాలి?"

"ఏ రూలు?"

కొత్తవాళ్ళను దోసకాయలపల్లిలో పోస్టు చేసి, పాత వాళ్ళను హెడ్‌ఆఫీసుకి మార్చడం గురించి చెప్పింది. ఇంకా ఇలా అంది: "ఆ రూలు బాగానే ఉంది. సీనియర్లు సౌకర్యాలు అనుభవించాలన్నదీ ఒప్పుకుంటాను. నేను మగవాడిని అయితే ఈ విషయంలో చింతించను. ఆడదానిగా బస్సులో రావడం ఎంత కష్టంగా ఉందో తెలుసా?"

"కష్టమా? ఎందుకు?"

"ఆ బస్సు డ్రైవరు పగటిపూటకూడా తాగే ఉంటాడు. ఎంతోమంది బయట వాళ్ళుకూడా ఆ బస్సులో ఎక్కుతున్నారు. వాళ్ళ దగ్గర్నుంచి డబ్బు వసూలు చేసి డ్రైవరు, హెల్పరు పంచుకుంటున్నారు. అందువల్ల ఈ ఆఫీసులో పనిచేసే వాళ్ళకు సీట్లు దొరకడం లేదు. ఆ బస్సులో వచ్చే వాళ్ళలో నేను ఒక్కర్తినీ ఆడదాన్ని కావడంతో అందరూ చూసే వెకిలి చూపులు, తప్పనిసరి కాకపోయినా నన్ను తాకాలని వాళ్ళు పడే తాపత్రయం... ఒళ్ళు మండిపోతుంది. ఈ విషయాలు మీకు తెలియదని అనుకోను. యూనియన్ లీడర్‌గా మీరు ఏం చేస్తున్నారు?" అంది దమయంతి.

ప్రసాదరావు గుటకలు మింగాడు. అతణ్ణి ఎవ్వరూ అంత ధైర్యంగా నిలదీసి ఏ విషయమూ అడగలేదు.


"యాజమాన్యంతో దెబ్బ లాడుతూ ఏవేవో సౌకర్యాల కోసం పోట్లాడటమే కాదు. యాజమాన్యంతో సహకరించి సంస్థలో నిర్మాణాత్మకమైన మార్పులు తేవాలి. ప్రభుత్వం 'వర్కర్స్ పార్టిసిపేషన్ ఇన్ మేనేజ్‌మెంట్' అన్న స్కీము ప్రవేశపెట్టింది. అందులో ఉన్న కొన్ని లోటుపాట్లు సరిదిద్ది, ఇప్పుడు కొత్తగా 'పార్టిసిపేటివ్ మేనేజ్‌మెంట్ ఇన్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్' అన్న స్కీము వచ్చింది. దీన్ని గురించి తెలియ చెప్పడానికి ఈ మధ్య ఢిల్లీలో ఒక సెమినార్‌కూడా ఏర్పాటు చేశారు. మీకు తెలియదా?" అంది మళ్ళీ.

ప్రసాదరావుకి ఈ విషయాలు తెలును కానీ. వాటిని పట్టించుకోలేదు. "ఇక్కడ చేరకముందు ఎక్కడ పని చేసేవారు?" అడిగాడు ప్రసాదరావు.

"ఎక్కడా లేదు. ఇదే మొదలు" అంది దమయంతి.

'చేరిన ఈ కొద్ది రోజుల్లో ఇన్ని విషయాలు తెలుసుకున్న ఈమె సామాన్యురాలు కాదని అర్థం చేసుకున్నాడు. ప్రసాదరావు మాట్లాడలేదు.

"కనక ఆడవాళ్ళకు ఈ రూలు వర్తించకూడదు. ఇది అన్యాయం" అంది మళ్ళీ.




"లేదు. న్యాయమే! ఆడవాళ్ళయినా, మీకుకూడా జీతం ఇస్తున్నారు కదా" అన్నాడు.

"ఒకసారి పెట్టిన రూలు ఎప్పటికీ అలాగే ఉండాలని లేదు. మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు కనక ఆడవాళ్ళు అయితే. జూనియర్లు అయినా హెడ్డాఫీసులోనే పోస్టింగ్ జరిగేలా చూడండి. ఆ తరవాత మీకు ఫీజు... అదే యూనియన్ ఫీజు... ఇస్తాను" అంది దమయంతి.

ఆమెతో మరి కొంచెం మాట్లాడి ఆమెను లొంగదీసుకోవా లనుకున్నాడు కానీ. దమయంతి కొరకరాని కొయ్య అని గుర్తించి ఫీజు వసూలు చేసుకోకుండానే వెళ్ళిపోయాడు ప్రసాదరావు.

** ** **

రెండు నెలలు గడిచాయి. ఈ మధ్య కాలంలో ప్రసాదరావు దమయంతిని కలవ లేదు. ఆమెకూడా అతని గురించి పట్టించుకోలేదు.

ఆ రోజు ప్రసాదరావు మళ్ళీ ఆమె సీటు దగ్గరకు వచ్చాడు.

"అప్పట్లో మీ వాదాన్ని సమర్థించలేక పోయాను కానీ, తరవాత ఆలోచిస్తే ఆ విషయం సమంజసం అని తోచింది. ఆడవాళ్ళు బస్సుల్లో ఇంత దూరం లకు రావడం కష్టమే. కనక కొత్తగా చేరినా ఆడవాళ్ళను హెడ్డాఫీసులోనే పోస్టు చెయ్యాలనీ, మగవాళ్ళయితే ఈ దోసకాయలపల్లిలో పోస్టు చేసి ఇక్కడ నుంచి సీనియర్‌ను హెడ్డాఫీసులో పోస్టు చెయ్యాలనీ ఒప్పందం కుదుర్చుకున్నాం" అన్నాడు ప్రసాదరావు.

"అప్పట్లో న్యాయం అంటూ మీకు తోచింది. ఇప్పుడు అది అన్యాయం అని ఒప్పుకున్నా రన్న మాట!" అంది దమయంతి.

"అవును. ఆ కొత్త రూలు ప్రకారం మీకు హెడ్డాఫీసుకి బదలీ అయిపోతోంది. ఒక నాలుగు రోజుల్లో ఆర్డర్లు వస్తాయి."

"థాంక్స్."

"ఇప్పుడు మెంబరుగా చేరుతారా?"

"బదలీ అయి. హెడ్డాఫీసులో చేరాక మీ మెంబర్షిప్ ఫీజు ఇస్తాను."

"సరే" అంటూ వెళ్ళిపోయాడు ప్రసాదరావు.

** ** **

దమయంతికి బదలీ అయింది. ఇప్పుడు హెడ్డాఫీసులో పని చేస్తోంది.

ఆమె యూనియన్‌లో మెంబరు అయిందికూడా.

ఆమె హెడ్డాఫీసుకి బదలీ అయిన ఒక నెల తరవాత ఆ ఆఫీసులో కొత్తగా ఒక అమ్మాయి చేరింది. కొత్త రూలు ప్రకారం ఆమె పోస్టింగ్ హెడ్డాఫీసులోనే. కొత్తగా చేరిన ఆ అమ్మాయి ప్రసాదరావుకి మరదలు అని తెలిశాక మాత్రం దమయంతి కోపం ఆగలేదు. ఆమె సర్వం ఊహించుకో గలిగింది.

ఒక రోజు ప్రసాదరావు ఆమెకు కనిపిస్తే నిలబెట్టి దులిపేసింది. "చాలా గొప్పవారండీ మీరు. ఆ రోజు నేను చెప్పిన నా కష్టాలు విని ఇక్కడకు బదలీ చేయించా రనుకున్నాను. కానీ. కారణం అది కాదని తెలిసింది. నాతో మాట్లాడిన తరవాత మీ మరదలు ఈ ఉద్యోగానికి సెలెక్టు అయి ఉంటుంది. నేను చెప్పిన కష్టాలు ఆమె పడకూడదని ఆమె కోసం రూలు మార్చించారు. అందువల్ల నాకు లాభం కలిగినా. మీరు తీసుకున్న చర్య కేవలం స్వార్థం తోనే! పాత రూలువల్ల ఆమె నేను పడ్డ కష్టాలు అనుభవించకూడదని రూలు మార్చించారు. బాధ పడుతున్నది నేనే అయినప్పుడు మీరు అది న్యాయమే అన్నారు. అలా బాధ పడబోయేది మీ వాళ్ళు అయినప్పుడు అది అన్యాయం అయిపోయిందా? మీ దృష్టిలో న్యాయానికీ. అన్యాయానికీ తేడా ఇంతేనా? నాకు చెయ్యి కాలక పక్కవాడికి కాలితే న్యాయం. నాకే కాలితే అన్యాయం అన్న దృష్టి తప్ప నిజమైన తేడా మీకు తెలియదు" అంది కోపంగా.

ఉన్నది ఉన్నట్లు ఊహించుకున్న దమయంతి ప్రజ్ఞకు అబ్బురపడి. తల దించుకున్నాడు ప్రసాదరావు.

*